
## చిన్నకథ

నాన్న మరణం అమ్మనెంతో కుంగదీసింది. నిద్రాహారాలు మానేసి, ఎప్పుడూ ఏవో ఆలోచనలు. బుజ్జగించినా, కోపం చేసినా ఆమె పరిస్థితిలో మార్పు రావడం లేదు. శూన్యంలోకి చూస్తూ, సన్నగా రోదించడం, అచేతనంగా ఆలోచిస్తూ ఉండిపోవడం చేస్తోంది. ఇక లాభం లేదనుకుని,ఆమెను మాతో పాటు పట్నం తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నా . నా మనసులోని మాట కాళిందినితో చెప్పాను.

"మనకు మాత్రం ఎవరున్నారండి. తీసుకురండి. ఒకరికొకరం తోడుగా అన్నట్లుంటుంది'' అన్నది.

# కాకులు




నాకు చాలా ఆనందమనిపించింది. మా మాట అమ్మతో చెప్పాం. నాన్నతో కలిసి జీవించిన ఆ ఇంటిని, తను కోడలిగా వచ్చినప్పటినుంచి తిరుగాడిన ఆ వూరిని వదిలి రావడానికి అస్సలు ఇష్టపడలేదు. మేము బాగా బతిమాలడంతో తాతయ్య కోపం చేయడంతో కష్టంగానే మాతో నల్లగొండ బయలుదేరింది.

మా కాలనీ పట్టణానికి చాలా దూరంగా ఉంది. రెండు వైపులా కొండలు. మరో పక్క మామిడితోట. తలుపు తెరవగానే కనిపించే పచ్చటి పంటపొలాలు. పల్లెటూళ్లో ఉన్నట్లే ఉంటుంది. పట్నం మురికింకా మా కాలనీ చేరలేదు. ఆ ఆహ్లాదకరమైన వాతావరణం మా అమ్మకు కొండంత మేలు చేసింది. కొంచెంలో కొంచెం తనింట్లోనే ఉన్నట్లుగా ఉంది. అయినా అమ్మలో పెద్దగా మార్పు రాలేదు. .పాత జ్ఞాపకాలను మరిచిపోలేక, రోజులో ఎక్కువభాగం, విచారంలోనే మునిగిపోతోంది. అమ్మను మామూలు మనిషిని ఎలా చేయాలా అని ఆలోచన చేశా. నాన్న గురించిన ఆలోచనలనుండి ఆమెను దూరం చేయడం కష్టం. ఆ ఆలోచనలతోనే జీవించే పద్ధతి కోసం ఒక ప్లాన్ చేశా.

ఆ సాయంత్రం అమ్మ వద్ద కూర్చుని మజ్జిగ ఇస్తూ "మరణించిన వారి ఆత్మలు కాకి రూపంలో నిక్షిప్తమై మన చుట్టూ తిరుగుతుంటాయమ్మా. వాటికి ముప్పూటలా ఇంత ఆహారం పెడితే,మన పెద్దలకు భోజనం పెట్టినట్లే. నిన్న స్వామీజీ చెప్పారు ఆలయంలో'' అన్నాను.

నా మాటలు అమ్మమీద బాగా ప్రభావం చూపాయి. తను తింటున్న దాంట్లో కొంత కాకికి పెట్టసాగింది. దానికి పెట్టకుండా తనెప్పుడూ అన్నం తినేది కాదు. కాకి రూపంలో మా నాన్నని చూసుకునేది. మా అమ్మ వితరణకు ఒక కాకిపోయి పది కాకులు తయారయ్యాయి. వాటిని మా నాన్న స్నేహితులుగా భావించేది. క్రమేపీ మా అమ్మ ఆరోగ్యం బాగుపడ్డది. మా ఇంటి చుట్టుపక్కలున్న చెట్లలో కాకులు చేరి, పొద్దుపొడవకముందే మేతకోసం కావ్ కావ్ అంటూ గోల చేసేవి. అంతకు ముందే నిద్రలేచే అమ్మ ఆనందంగా వాటికి ఆహారం పెట్టేది. అమ్మకోసం ఎంత గోలనైనా ఆనందంగా భరించడం నేర్చుకున్నాం. సంవత్సరాలు గడుస్తున్నాయి.

కాకుల కంటే ముందుగా లేచి, ఇంటి ముందు కళ్లాపి చల్లి ముగ్గువేసే అమ్మ, ఆరోజు కాకుల శబ్దానికి కూడ మేలుకోలేదు. రాత్రి నిద్రలోనే ఆమె తుదిశ్వాస విడిచింది. బంధువర్గానికంతా కబురు చేశాం. మా నాన్న ఇంటికి పెద్ద కొడుకు. నాన్నతోడ ఆరుగురు అన్నదమ్ములు. ముగ్గురు అక్కచెల్లెండ్లు. పెద్దకోడలిగా పదిహేడో ఏటనే ఆ ఇంటికి వచ్చింది అమ్మ. అందరినీ చదివించి,పెళ్లిళ్లు చేసి,స్థిరపడిందాకా తాత, నాయనతో కలిసి తనూ భుజం మోపి, సంసార భారాన్నంతా మోసింది. అమ్మ కడచూపు కోసం బంధువులు, స్నేహితులు వచ్చారు. అమ్మ మంచితనం గురించి,ఆమె చేసిన సేవల గురించి ఒకరిని మించి ఒకరు ఘనంగా చెప్పుకుంటూ పొగడసాగారు. అందరం కలసి అమ్మ అంత్యక్రియలు నిర్వహించాం.

పదకొండోరోజు పూజాదికాలు పూర్తయ్యేసరికి మధ్యాహ్నమైంది. అమ్మగొప్పదనం సాగదీసి పొగిడిన మా దాయాదులంతా, పెద్దకర్మ ముగిసేదాకా ఏమీ తినకూడదన్న సంప్రదాయాన్ని తన్నేసి టిఫిన్ మొత్తం ఖాళీ చేశారు.

చివరగా అమ్మకు పిండ ప్రదానం. ఆమెకు ఇష్టమైన తినుబండారాలన్నీ కాకులకు పెట్టాలన్నారు. మా పిల్లలతో కలిసి, నేను అమ్మకిష్టమైన ఆహార పదార్థాలన్నీ పూజ స్థలంవద్దే ఆరగించమని పెట్టి దూరంగా వెళ్లాము. చిత్రం.. ఒక్క కాకి కూడా ముట్టలేదు. మా చర్యలన్నీ చెట్టుమీదనుంచి చూస్తున్నాయే కాని ఒక్క కాకీ చెట్టు దిగలేదు. మా బంధువులంతా నాకు గొప్పదనం ఆపాదిస్తూ,అమ్మను చులకన చేసి మాట్లాడసాగారు. కాకుల్ని తిట్టసాగారు. నేను చిరుకోపంతో వారిని మందలించాను.

నిత్యం అన్నంపెట్టే వ్యక్తి ఇకలేదన్న సంగతి కాకులకు కూడా తెలిసిపోయినట్లు, నాకు మా అమ్మ మరణించిన రోజే అర్థమైంది. తెల్లవారకముందే కావ్ కావ్ అంటూ మా ఇంటిచుట్టూ తిరిగే కాకులు, అమ్మ మరణంతో నిశ్శబ్దంగా ఉండిపోయాయి. అమ్మను పాడెపై పడుకోబెట్టి మేం రోదిస్తున్నప్పటి దృశ్యాన్ని చెట్టుపై నుండి నిశ్శబ్దంగా చూస్తూండిపోయాయి. తర్వాత అవి బాధతో ఉపవాసం ఉంటున్నాయేమో ననిపించింది. మా అమ్మ ఆసరాతో బతుకులు నిలుపుకున్న మా దాయాదులు మాత్రం పెద్దకర్మ ముగిసేదాకా ఆకలికి ఆగలేకపోయారు. కాకికున్న స్పందన ఈమనుషులకెందుకు ఉండదో ఇప్పటికీ నాకర్థం కాలేదు. భోజనాలయ్యాక బంధువులంతా వెళ్లిపోయారు.

***

ఉదయం నిద్ర లేచేసరికి చెట్టుమీద వాలిన కొత్త కాకి ఒకటి ఒహటే గోలగోలగా అరుస్తోంది. మా అమ్మే వచ్చిందనుకున్నాను. నన్ను చూడందే ఉండలేక నా చేతి అన్నం కోసం ఎదురు చూస్తున్నట్లు అనిపించింది. గబాల్న లేచి ఇంట్లోకి పరిగెత్తాను. అమ్మ కిష్టమైన తినుబండారాలన్నీ తెచ్చి, డాబాపైన పెట్టాను. నమ్మలేనట్లుగా కొత్తకాకి పక్కన పాత కాకి వచ్చి వాలింది. నా హృదయం ఆనందంతో పొంగింది. అది నాన్న రూపం అయి ఉంటుంది. రివ్వున కాకులు రెండూ వచ్చి వాలాయి. అమ్మానాన్న వెనకాలే ఫ్రెండ్స్ కూడా పదులకొద్దీ. ఇక నిత్యం వాటికి పెట్టకుండా మేము తినడం లేదు. మా నాన్నను వాటి రూపంలో చూసుకుంటూ తృప్తి పడుతున్నాను.

– పి.వేణుగోపాలరావు